# దూరదర్శన్ నీతులు వినుము



ఇటీవలి కాలంలో తెలుగు టీవీ కార్యక్రమాలన్నింటిలోనూ అడ్వర్టయిజ్‌మెంట్ ఫిలిమ్స్ చాలా ఆకర్షణీయంగా, ఆసక్తికరంగావుంటున్నాయని మాకాలనీలో చిన్నా, పెద్దా అంతా ఏకగ్రీవంగా తమ అభిప్రాయం వెలిబుచ్చసాగారు.

ముఖ్యంగా ఈమధ్య దూరదర్శన్ ఎవరెవరితోనో డబ్బిచ్చి తయారుచేయించిన సందేశాత్మక షార్ట్ ఫిలిమ్స్ మావాళ్ళను ఎంతగానో ఆకర్షించసాగాయి. అందరం కలుసుకున్నప్పుడల్లా ఆటోమేటిగ్గాచర్చ వాటిమీదకే మళ్ళుతోంది.

"అబ్బ! తూకం రాళ్ళ గురించి దూరదర్శన్‌లో ప్రోగ్రాం ఎంత బావుందో చూశారా! ప్రభుత్వం నిర్దేశించిన తూకం రాళ్ళు కాకుండా ఇష్టం వచ్చిన రాళ్ళూరప్పలతో వస్తువులు తూచి ఎంతమంది మనకమ్మడం లేదు? మనం ఎప్పుడయినా ఆ విషయం గురించి పట్టించుకున్నామా? పాపం మన తెలుగు దూరదర్శన్ వాళ్లు ప్రపంచంలోని అన్ని దేశాల దూరదర్శన్‌ల కంటే తెలివిగలవాళ్ళు కాబట్టి మనలోని అజ్ఞానాన్ని పారద్రోల డానికి

కంకణం కట్టుకున్నారు!" అంది సావిత్రమ్మగారు.

"మీరు చెప్పినమాట నిజమే! వస్తువుల అమ్మకంలో వర్తకులు ఇచ్చే డిస్కౌంట్లు, రిబేట్‌ల గురించి కూడా ఎంత అద్భుతమైన ఫిలిమ్ చూపించారు పాపం! వాళ్ళు చేప్పే వరకూ అవన్నీ మోసాలని నాకు తెలీనే తెలీదు-అంతెందుకు ఆడపిల్లకు పద్దెనిమిది సంవత్సరాల వయసొచ్చేవరకూ పెళ్ళి చేయగూడదని వాళ్ళు ఎంత చక్కగా సందేశం ఇచ్చారో తెలుసా? అసలు అలాంటి పెళ్ళిళ్ళు చేయటం నేరమంట! దూరదర్శన్ వాళ్ళు ఆ విషయం చెప్పేంత వరకూ ఎవరికీ తెలీదసలు-" అంది పార్వతీ దేవి

"అదీ గాకుండా మాదవద్రవ్యాలు వాడటం వల్ల కలిగే హాని గురించి ఎంత విశదంగా సందేశాలు ఇస్తున్నారో చూశావా? అసలు మాదక ద్రవ్యాలంటే ఏమిటో, అవి ఎలా వాడాలో అప్పుడే తెలిసింది చాలామందికి" అన్నాడు గోపాల్రావ్.

"నిజంగా అజ్ఞానంలో వున్న మన తెలుగు ప్రజలకు మన తెలుగు టీవీ కనువిప్పు కలిగిస్తోంది" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! మనం రోజూ చూస్తూనే వున్నా పట్టించుకోని అనేక అవకతవకల వల్ల మనకూ మన సమాజానికీ, ఎంత నష్టం జరుగుతోందో ఈ దూరదర్శన్ షార్ట్ ఫిలిమ్స్ వల్ల తెలుసు కోగలుగుతున్నాం" అన్నాడు చంద్రకాంత్.

"కానీ వాళ్ళు మన ప్రజలకిచ్చే సందేశాలన్నీ మనం కేవలం చూసి మర్చిపోతే ఆ కార్యక్రమాల వల్ల వుపయోగమేముంటుంది? కేవలం మన తెలుగు ప్రజల మీద ప్రేమతో లక్షల రూపాయల ఖర్చుచ్చే ఆ కార్యక్రమాలను కోట్లు ఖర్చుచేసి రూపొందించాలంటే మనం ఆ సందేశాలన్నీ అమలుచేయాలి!" అన్నాడు శాయిరామ్ మరి పేట్రేగిపోతూ

"అవును! మన కాలనీ వాళ్ళందరం రేపటినుంచీ ఆ సందేశాలను అమలు పరచి మొత్తం రాష్ట్రమంతటికి మార్గదర్శకులవుదాం!" అన్నాడు జనార్ధన్, ఆడా మగా పిల్లా పీచూ అందరూ మర్నాటి నుంచి మన దూరదర్శన్ కన్న కలలు నిజం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఆ రాత్రి మాలో చాలామందికి ఎగ్జయిట్‌మెంట్‌తో నిద్రపట్టలేదు. దూరదర్శన్ చూపిస్తోన్న మార్గదర్శక సూత్రాలను అమలుపరచామంటే మా కాలనీకీ అటు సమాజానికీ ఎంత లాభం కలుగుతుందో!

అలా చేస్తే వెంటనే మా కాలనీ గురించి న్యూస్‌పేపర్స్‌లో వార్తలు వచ్చేస్తాయి.

"నిర్భయ్‌నగర్ కాలనీ వాసులు దూరదర్శన్ విజ్ఞాన భోధక చిత్రాలకు ప్రేరితులై తమ పట్ల జరుగుతున్న అనేక అన్యాయాలను ఎదుర్కొన్న ఉదంతం" అంటూ రాసేస్తారు. ఆ వార్తలు చదివి దూరదర్శన్ అధికారులు మా కాలనీ కొచ్చి మావాళ్ళందరి ముందూ మైక్‌పెట్టి ఇంటర్వ్యూలు చేస్తారు.

"చూడండి రంగారెడ్డి గారు! తూకం రాళ్ళ విషయంలో సామాన్య ప్రజలకు అన్యాయం జరుగుతోందన్న విషయం మీకెలా తెలింసిందో చెప్తారా?"

"కేవలం హైద్రాబాద్ దూరదర్శన్ వారు చూపిస్తోన్న షార్ట్ ఫిలిమ్స్ వల్లే తెలిసిం దండీ! అంతకుముందు మేమెలా మోసపోతున్నామనే మాకు తెలీదు"

"చాలా సంతోషం! ఆ! మీరు చెప్పండి శాయిరామ్ గారూ! అనేకమంది వ్యాపారస్తులు ప్రకటిస్తోన్న డిస్కౌంట్‌లు, రిబేట్‌లు మోసంతో కూడుకున్నవని మీకెలా తెలిసిందో చెప్పగలరా?"

"ఎందుకు చెప్పలేనండీ! ఇదంతా కేవలం దూరదర్శన్ రూపొందించిన షార్టు ఫిలిమ్స్ దయ! ఆ చిత్రాలు చూసే వరకు మాకు అందులో మోసం వుంటుందనే తెలీదండీ, అన్నీ నిజమే అనుకుని రిబేట్ లిచ్చే అన్ని దుకాణాల్లోనూ వస్తువులు కొనే వాళ్ళం!"

"చూడండి సావిత్రి గారూ! ఆడపిల్ల వయసు పద్దెనిమిదేళ్ళులేందే పెళ్ళిచేయడం నేరమన్న విషయం మీరు ఎలా తెలుసు కోగలిగారు?"

"దూరదర్శన్ వాళ్ళు చెప్ప బట్టే తెలిసిందండీ! అది తెలీక ఎంతమంది తక్కువ వయసున్న ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేస్తున్నారో మేం చూశాం"

"ఆ షార్ట్ ఫిలిమ్స్ చూడడంవల్ల పద్దెనిమిది సంవత్సరాలలోపు ఆడపిల్లలకు పెళ్ళిచేయకూడదని మీరు నిర్ణయించుకున్నారా?"

"అవునండీ! నిజానికి పదిహేడేళ్ళున్న మా పిన్ని గారమ్మాయికి సెటిలయిన సంబంధం నేనే దగ్గరుండి కేన్సిల్ చేశానండీ! ఏమయినా సరే పద్దెనిమిది సంవత్సరాలు వచ్చే వరకూ చేయడానికి వీల్లేదని మా పిన్నికి చేప్పేశాను."

"చాలా సంతోషమండీ! మా దూరదర్శన్ వల్ల మీకెంత విజ్ఞానం కలిగినందుకు చాలా సంతోషం"

ఇలా మేమందరం దూరదర్శన్‌లో కనిపించే అవకాశం వస్తుందని ఉవ్విళ్ళూరి పోయాము.

మర్నాడు ఎప్పుడూ లేంది ఉదయం అయిదు గంటలకే నిద్రలేచి పోయాము. అప్పుడే కుర్రాడు పాల పాకెట్ తీసుకొచ్చి ఇచ్చాడు.

మా ఆవిడ పాకెట్ కట్ చేయబోతుంటే "ఆగు!" అని అరచాను నేను.

అలా అరవడం అంటే నాకెంతో ఇష్టం! ఎందుకంటే తెలుగు సినిమాల న్నింటిలోనూ ఎక్కడోచోట అలా హీరోయిన్ తండ్రోలేక విలనో 'ఆగు!' అంటూ అరవడం కొట్టిన పిండి అయిపోయింది.

"ఏమిటలా గావుకేక వేశారు? ఏమయింది" అడిగింది మా ఆవిడ బెదిరిపోతూ!

"ఆ పాలపాకెట్ వెయిట్ కరెక్ట్‌గా వుందేమో చూడాలి ఇవాళ్టి నుంచీ మన కాలనీ

దూరదర్శన్ సందేశాత్మక చిత్రాల ఎడాప్టెడ్ కాలనీగా మారిపోయిందన్న సంగతి మర్చిపోయావా?" అన్నాను సగర్వంగా.

మా ఆవిడ నవ్వింది.

"బాగుంది! ఆ తూకాలీన్నీ ప్రైవేట్ వ్యాపారస్తుల విషయంలో చూడాలి గానీ, గవర్నమెంట్ పాకెట్స్ కెందుకు? అవన్నీ ప్రభుత్వం సరిచూశాకే రిలీజ్ చేస్తుంది" అందామె.

నేను చిరువ్వు నవ్వాను.

"పిచ్చిదానా! మనం అలా ప్రభుత్వ తూకాలూ, ప్రైవేట్ తూకాలు అంటూ పక్షపాతం చూపకూడదు. మనం ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ పౌరులం! ఎలాంటి నాన్సెన్స్‌నీ భరించం!" అంటూ పాకెట్ తీసుకొని రంగారెడ్డి ఇంటికెళ్లాను. రంగారెడ్డి దగ్గర ఒక చిన్న వెయింగ్ మిషన్ వుంది. దాని మీద ఉంచి పాకెట్ తూశాము. వెయిట్ కొంచెం తక్కువ కనిపించింది.

మా ఇద్దరి మొఖాల్లోనూ విజయగర్వం తొంగి చూసింది కాలనీ వాళ్ళందరినీ పిలిచి అందరికీ ఆ అక్రమం కళ్ళారా చూపించాము.

అందరి మిల్క్ పాకెట్సూ అప్పటికప్పుడే తూకంచూశాం!

అన్నీ కొన్ని గ్రాముల బరువు చొప్పున తక్కువగా కనబడుతోన్నయ్.

ఆడాళ్ళందరూ మా చుట్టూ మూగిపోయారు.

"చూశారా పిన్నిగారు! పాల పాకెట్లలోనే మోసం జరిగిపోతోంది. మనాళ్ళు తెలివి గలవాళ్ళు కాబట్టి పట్టుకున్నారు!" అందొకామె.

అందరం కలిసి పాలబూత్ అతని దగ్గరకు నడిచాం- చేతిలో అతనిచ్చిన పాల పాకెట్స్ పట్టుకుని.

"ఏం సార్! పాకెట్లు వెనక్కు తెస్తున్నారేమిటి సంగతి?" అడిగాడు అతను.

మేమంతా తొందరపడకుడా ముందు చిరునవ్వు నవ్వాం.

"ఏమిటి సంగతి? ఎంతకాలం మోసం చేయగలనను కుంటున్నావ్ మమ్మల్ని!" అన్నాడు రంగారెడ్డి పెద్ద ఫోజిచ్చి

"ఏమిటి సార్ సంగతి? మోసం ఏమిటి?"

"వెర్రివాడా ఈ పాకెట్ వెయిట్ రెండు గ్రాములు తక్కువుంది! ఇదే కాదు ఇంకా చాలా పాకెట్ల బరువు కూడా ఇలాగే తక్కువుందన్న విషయం మేము కనిపెట్టేశాం!" శాయిరామ్ కూడా డిటెక్టివ్‌లా ఫోజిస్తూ మాట్లాడాడు.

అతను చిరునవ్వు నవ్వి మా పాకెట్ చేతిలో పెట్టాడు మళ్ళీ.

"ఇంత ఎడ్యుకేటెడ్ అయుండి కూడా ఏమిటి సార్ మీరు! ఇవన్నీ పాలిథిన్‌బాగ్స్. అంచేత ఆకవరుకు ఏమూల కొంచెం లీకేజ్ వున్నా కొంచెం వెయిట్ తగ్గుతుంది. అయినా ఒకటి రెండు గ్రాముల కోసం ఇంతగొడవేమిటి సార్! భలేవారే! చాలామంది పాతిక

గ్రాములు తగ్గినా ఏమీ మాట్లాడకుండా తీసుకుంటున్నారు"

"అదేం కుదరదోయ్! మేము టీవీలో తూకాలకు సంబంధించిన సందేశాత్మక చిత్రం చూశాం! ఇలా మోసాలు చేసే వాళ్ళను వెయిట్స్ అండ్ మెజరమెంట్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళకు పట్టిస్తాం! అతని మొఖంలో చిరాకు కనిపించిది.

"మీరు ఎడ్యుకేటెడ్ అయుండి కూడా ఏమిటి సార్! మీ ఇష్టం! వెళ్ళి డెయిరీ డెవలప్‌మెంట్ వాళ్ళ దగ్గర కంప్లెయింట్ చేసుకోండి! పాక్ చేసేది వాళ్ళు-

ఆ మాట అనగానే గతుక్కుమన్నాం!

ఒక ప్రభుత్వ సంస్థకు గానీ, ప్రభుత్వ కార్పోరేషన్‌కు గానీ కంప్లెయింట్ చేయడానికి వెళితే ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయో మాకు బాగా తెలుసు

మాట్లాడకుండా ఇంటికి తిరిగి వచ్చాం

ఆ తర్వాత కాఫీ ఫలహారాలు పూర్తిచేసి అందరం కూరగాయల మార్కెట్‌కి బయలు దేరాం. కూరగాయల మార్కెట్ లోనే ఘోరమయిన తూకాల అక్రమాలు జరుగుతున్నట్టు టీవీలో చూపించడం మాకు కళ్ళకు కట్టినట్టు గుర్తుండి పోయింది.

ఓ స్త్రీ మా ఎదురుగ్గానే మామూలు కంకర్రాళ్ళతో కూరగాయలు తూచి అమ్మడం కనిపించే సరికి అందరం ఆమె దగ్గరకు చేరుకున్నాం.

"ఏం గావాలి?" అడిగిందామె.

"ఆలుగడ్డ ఎట్టిచ్చినవ్?" అడిగాడు యాదగిరి.

"కిలో నాల్గు రూపాయలు."

"ఒక కిలో ఇవ్వు!"

ఆమె మామూలు గానే ఒపెద్ద కంకర్రాయ్ తక్కెడలో వేసి ఆలుగడ్డలు తూయ సాగింది. మేమదరం మాలో మేము మొఖాలు చూసుకుని సైగలు చేసుకుని నవ్వుకున్నాం.

మేము మిగతా అందరిలాంటి పౌరులం అనుకుంటోంది పిచ్చిది. మేము దూరదర్శన్ చూసే వాళ్ళమనీ, ఆ తూకాల గురించి తేల్చుకోడానికే వచ్చామనీ తెలీదు పాపం!

"సంచీ పట్టు" అందామె ఆలుగడ్డలు తక్కెడలోనే పట్టుకుని.

''ఆ కంకరయ్ ఏమిటి. ఎంతమందిని ఆ రాయితో మోసం చేద్దామను కుంటున్నావ్?" అన్నాడు రంగారెడ్డి.

"నువ్వా కంకర్రాయ్‌తో తూస్తావని ముందే తెలుసు మాకు! అందుకే నీ దగ్గర కొచ్చాం" అన్నాడు శాయిరామ్.

"వెంటనే ఆ రాయి తీసి అవతల పారేసి ప్రభుత్వం వారిచే సప్లయ్ చేయబడే తూకం రాళ్ళు తీసుకురా!" అన్నాడు చంద్రకాంత్.

మా తెలివికి ఆమె షాకయిపోతుందని, భయపడి వణికిపోతుందనీ మేం ఎక్స్‌పెక్ట్ చేశాం.

ఆమె అంతవరకూ నములుతోన్న పాన్ పక్కనే ఊసి తక్కెడ లోని ఆలుగడ్డలు మళ్ళీ కుప్పలో వేసేసింది.

"ఏమిరా బాడుకవ్! నువ్ కొనే కిలోకి సర్కార్ తూకాల్ కావాలి? నీ మొఖం అద్దంలో సూస్కోరా బాడుకవ్ ఎట్టుందో! థూ! తేరికీ... సర్కార్ తూకం కావాల్నంటా నంగా గాళ్ళకీ" అంటూ బిగ్గరగా తిట్లు ప్రారంభించింది.

మేమందరం నిశ్చేష్టులమయాం! అలా తిట్లు తినడం అదే మొదటిసారి! అందరి మొఖాలూ అవమానంతో ఎరుపెక్కిపోయినయ్.

"ఏయ్! తూకం సరిగ్గా ఇమ్మంటే తిడుతున్నా వేమిటి? వళ్ళు దగ్గరుంచుకుని మాట్లాడు!" అన్నాడు రంగారెడ్డి కోపంగా.

"ఏమిరా సాలే! నువ్వేం వర్లుతున్నావ్ రా! జిందగీల కూరగాయలు కొన్న మొఖమేరా బాడుకవ్ నీది!" అంటూ రంగారెడ్డిని కూడా తిట్టేసరికి చుట్టుపక్కలున్న జనమంతా పోగయిపోయారు.

"ఏమాయే లచ్చమ్మా!" అంటూ పొడుగాటి కర్ర తీసుకొచ్చాడు గిరజాల జుట్టువాడు

"ఇగో! పేద్ద సంచులు తీసుకొచ్చిన్రు సూడు బాడుకవ్‌లు– కూరలు కొననికి. ఈ కమీనా గాండ్లకు సర్కార్ తూకం రాయ్ కాలాల్నంట! గద్దార్ సాలే గాండ్లకు" మాకు ఆ తిట్లు వింటూంటే కోపంతో రక్తం ఉడికి పోసాగింది. కానీ ఎదురుగ్గా తిడుతున్నది ఆడమనిషి! ఏం చేయడానికి తోచడం లేదు.

యాదగిరి మాత్రం ఆ తిట్లు సహించలేకపోయాడు.

"ఏయ్ బుడ్డీ! నీకేమయినా బుద్దున్నదా! నీయవ్వ తూకం మంచిగా లేదంటే తిడతావ్! పోలీస్‌కి జెప్పి లోపటజేయిస్త! ఫాల్తూ నకరాలు జేసినావంటే! ఏం? మేము ఊరోళ్ళ మునుకున్నావా నీ ఇష్ట మొచ్చినలెక్క తిడితే ఊర్కోనికి?" అంటూ ఎదురు తిరిగాడు ధైర్యంగా.

యాదగిరి అద్భుతమయిన ధైర్య సాహసాలతో ఆమెకు ఎదురు తిరిగాడనీ, మా పరువు కాపాడాడనీ ఆ క్షణంలో మా కనిపించింది గానీ, మా అభిప్రాయం తప్పనీ, నిజానికి అతనలా మాట్లాడడం వల్ల మా పరువు మరింత బురదలో కూరుకు పోయిందనీ మాకు ఆ తర్వాత జరిగిన సంఘటనల వల్ల అర్థమయింది. ఆమె అమాంతం కూర్చున్న చోటు నుంచి లేచి ఆలుగడ్డల కుప్పమీద నుంచీ ముందుకి దూకి అమాంతం యాదగిరి షర్ట్ కాలర్ పట్టుకుంది.

"ఏమిరా బాడుకవ్! పోలీస్‌ని పిలుస్తావ్ బే! సాలే! పిల్వరా! గిప్పుడు పిలు దమ్ముంటే!

అదేయ్! నీయవ్వ గాడిద ముఖం కొడకల్లారా! పిల్వండిరా పోలీస్‌ని"అంది తొడ మీద కొట్టుకుని ఛాలెంజ్ చేస్తూ. మేమందరం అవాక్కయాము.

స్త్రీలు శక్తిస్వరూపిణులని ఆయనెవరో స్వామీజీ ఒకప్పుడు అంటూంటే విన్నాం గానీ, ఆ మాటలు నిజమేనని ఇప్పుడు అర్జంటుగా నమ్మాల్సి వచ్చేసరికి మతిపోయి నట్టయింది.

ఇప్పుడు ఆమె చేతి నుంచీ, ఆమె అమానుషంగా మమ్మల్ని అవమానపరుస్తోన్న దయనీయమైన పరిస్థితి నుంచీ ఎలా బయటపడాలో ఏమ్మాత్రం అర్ధం కావడం లేదు.

పరిస్థితి ఇంత రసవత్తరంగా కనిపించేసరికి ఇరవై నాలుగ్గంటలూ సినిమాలను ఆదరించే తెలుగు ప్రజలు మరి కొంతమంది మా చుట్టూ పోగయి పోయి అచ్చం సినిమా చూస్తున్నట్టే మమ్మల్ని చూడసాగారు- మధ్యమధ్యలో విజిల్స్ కూడా వేస్తూ.

యాదగిరి మొఖం పాలిపోయింది

"ఇగో! ముందు షర్టు వదులు" అన్నాడు డిఫెన్స్‌లో కొచ్చేస్తూ.

"అవునమ్మా! ముందు షర్టు వదిలేయ్" అన్నాడు శాయిరామ్ కూడా యాదగిరిని సపోర్టు చేస్తూ.

"పోలీస్‌ని పిలుస్తా నన్నావ్ కదురా బాడుకవ్! పిలువ్! ఆ పోలీస్ బాడుకవ్ ఏం జేస్తాడో నేనూ జూస్తా- నీ యవ్వ పిల్వంద్రా!" మరింత రెచ్చిపోతూ అరిచిందామె.

అతి భయంకరమయిన ఇరకాటంలో పడిపోయాము. తప్పు చేశామని క్షమార్పణ చెప్పుకుంటేనే తప్ప ఆమె చేతి నుంచి తప్పించుకునే మార్గం లేదని తెలిసిపోయింది. అయినా అంతహీన స్థితికి దిగ జారడానికి మనసొప్పడం లేదు.

"ఆళ్ళు ఆ దూరదర్శన్‌లో తూకాల గురించి జెప్తున్రు గదా! అజ్జూసి వచ్చుండొచ్చు లచ్చమ్మా!" అన్నాడు గరిజాల జుట్టోడు నవ్వుతూ. ఆ డైలాగ్‌తో మాకు పై ప్రాణాలు పైనే పోయినయ్.

"ఏరా దొంగ బాడుకవ్! దూరదర్శన్ లోజెప్పిన్రని రువాబ్ జేయనికి వచ్చినార్రా సాలే! నీయవ్వ- ఆ దూరదర్శనోడినీ తూకాలోడినీ, పోలిసోండ్లనీ ఇట్ట తోలు తీస్తాన్రా! సర్కారు తూకం కావాల్నంటే సర్కారోళ్ళ తానే కూరగాయలు కొనంద్రా! ఈడ ఊద్వడాని కొచ్చిన్రురా గద్దార్ సాలే-"

ఆ గిరిజాల వాడు పగలబడి నవ్వి తరువాత జోక్యం చేసుకున్నాడు- మా మీద జాలిపడి.

"పోనీ లచ్చక్కా! ఇడిసెయ్! ఇంకొక్కసారి ఫాల్తూ మాటలు జెప్పకుండా మంచిగ బుద్ధి జెప్పినవ్ గదా" అన్నాడు గిరజాల జుట్టువాడు.

అంతవరకూ వాడే విలన్ అనుకుంటున్న మాకు వాడా డైలాగ్ చెప్పడంతో దేవుడిలా కనిపించ సాగాడు.

"అరేయ్ బాడుకవులూ! ఇనంద్రి! ఇంకొక్కసారి తూకం గురించి మాట్లాడిన్రంటే మీ పెండ్లాలతాడు తెంపుతా! ఏమంటున్న" యాదగిరి చొక్కా వదిలేస్తూ అందామె.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది మాకు

"పొంద్రి ఈడకెళ్ళి! అకల్ లేదు సాలేగాండ్లకు" నీ యవ్వ మినిష్టర్లు, చీఫ్ మినిష్టర్లు, ప్రైమ్మినిష్టర్లు, లక్షల్ కోట్లు–కోట్లు తింటున్రు! ఆళ్ళనే మననికి దమ్ము లేదుగానీ, కూరగాయలమ్మే టోళ్ళు తూకంలో తక్కువ జేసిన్రని రువాబ్ జేయనికొస్తారు గలీజ్ బాడుకవ్‌లు!" అన్నాడు గిరిజాలవాడు.

మేమందరం అక్కడి నుంచీ ఎంత త్వరగా ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా బయటకు పారిపోవాలన్న ఆలోచనలో వుండడం చేత అతని మాటలు ఏమాత్రం పట్టించుకోకుండా వెనక్కు తిరగాము.

వెనక్కు తిరగామో లేదో "థూ– పొద్దుటేల్ పొద్దుటేల్ దందా అంతా ఖరాబ్ జేసిన్రు దొంగబాడుకవ్‌లు'' అంటూ మా వీపుల మీద తుపుక్కున పాన్ నమిలిన ఉమ్మేసిందామె. ఆ పాన్ ఉమ్ము వెచ్చగా వీపుకి తగిలినా వెనక్కు తిరిగి చూడకుండా వేగంగా నడిచాము.

మమ్మల్ని చూసి మిగతా కూరగాయల వాళ్ళందరూ ఆనందంగా నవ్వు కోవడం మాకు కనబడుతూనే వుంది.

"యేయ్! ఇగో అరే బాడుకవ్! ఈడ సర్కారీ తూకం రాళ్ళున్నాయ్! ఈడ కొనుక్కో" అంటూ హేళన చేస్తూ కొంతమంది మమ్మల్ని చూసి అరవసాగారు.

మాతోపాటు నడుస్తున్న పెద్దమనిషి మామీద జాలిపడ్డాడు. అతనే మేము లచ్చమ్మతో పేచీపడే ముందు ఆమె దగ్గర ఆలుగడ్డలు కొంటూన్న వ్యక్తి

"వీళ్ళతో పేచీపడటం మంచిది గాద్సార్! ఇజ్జత్ తీసేస్తారు'' అన్నాడతను సానుభూతితో

"ఆ లచ్చమ్మకు ఎట్ల బుద్ది చెప్తానో చూడండి! ఇప్పుడే వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్ ఆఫీస్ కెళ్ళి కంప్లెయింటిస్తాను. కూరగాయలు మార్కెట్లోని రాళ్ళన్నీ ఎట్లా మార్చరో చూస్తాను" అన్నాడు చంద్రకాంత్ కసిగా.

"ఆ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌ని ఇప్పుడే వెంబడి పెట్టుకుని తీసుకొద్దాం" అన్నాడు రంగారెడ్డి.

"అంతేకాదు! దానిమీదా, ఆ గిరజాల జుట్టువాడి మీదా పోలీస్ కంప్లెయింట్ కూడా ఇద్దాం" అన్నాడు శాయిరామ్ కసిగా.

"ఎవరొచ్చినా ఏం చేస్తారండీ! మీరూరికే ఆవేశపడుతున్నారు గానీ అసలిలాంటి విషయాల్లో తలదూర్చ కూడదు. మనం వాళ్ళతో పేచీపడితే మళ్ళీ ఆ ఇన్‌స్పెక్టర్ ముందే మీ చొక్కా పట్టుకుంటారు. అప్పుడేం జేస్తారు?"

నాకు అతడి మాట వింటూనే భయం వేసింది.

"అవును రెడ్డీ! మనం అలాంటి వాళ్ళతో గొడవ పడకపోవటం మంచిది" అన్నాడు ఉచితంగా సలహా ఇస్తూ.

"ఉహు! ఇంత అవమానం జరిగాక ఆ లచ్చమ్మను వదల్డానికి వీల్లేదు! పదండి వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్ ఆఫీస్‌కెళ్దాం" అన్నాడు గోపా్రావ్.

"అవ్! బరాబర్ దానికి బేయిజ్జత్ గావాలె" అన్నాడు యాదగిరి.

మాపక్కతను జేబులో నుంచి తన అయిడెంటిటీ కార్డు తీసి మాకు కనిపించేట్లు చూపించాడు.

అందరం ఆ కార్డుమీద అతనిపేరూ,డెజిగ్నేషనూ చూడగానే ఉలిక్కిపడ్డాం.

అతను వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్ డిపార్టుమెంట్‌లో ఆఫీసరే.

"అదేమిటి సార్! మీరు కూడా ఆ కంకర్రాళ్ళ తూకంతోనే కూరగాయలు కొంటున్నారా?" ఆశ్చర్యం నుంచి కోలుకుంటూ అడిగాన్నేను.

అతను చిరునవ్వునవ్వాడు

"లేకపోతే మీలాగా తిట్లు తిట్టించు కోమంటారా?"

మేము అతనిని అక్కడే వదలి మరింత వేగంగా కాలనీ వేపు బయల్దేరాం.

ఇంటికి చేరుకునేసరికి మా కాలనీ ఆడాళ్ళందరూ గుంపుగా నిలబడి ఏదో విషయం చర్చించు కుంటూ కనిపించారు. అందరి మొఖాలూ వాడిపోయి వున్నాయ్.

"ఏంటి? ఏం జరిగింది?" అడిగాడు గోపా్రావ్.

"ఏముంది? రిబేట్ ఇచ్చే షాపుల్లో మోసం వుందని దూరదర్శన్‌లో చూపించారు కదాని అస్సలు రిబేట్ లేని షాప్‌కెళ్ళాం. తీరా ఇంటి కొచ్చాక చూస్తే అక్కడ కొన్న బట్టలన్నీ సెకండ్స్! ఒక్క బట్టక్కూడా పోగులు సరగ్గాలేవు– కొన్ని లోపల రంగులు వెలిసిపోయి వున్నాయ్. వెనక్కు తిరిగివెళ్ళి అడిగితే ఒకసారి అమ్మిన బట్టలు వెనక్కు తీసుకోమని అన్నాడు. ఆ రిబేట్‌లో బట్టలు కొన్న సరస్వతమ్మ గారి బట్టలన్నీ బ్రహ్మాండంగా వున్నాయ్– తక్కువ ధరలో కూడా దొరికాయట" అందామె విచారంగా.

"ఇంతకూ మీ సంగతేమయింది? కూరగాయలు తేలేదేం?" అడిగింది సావిత్రమ్మ గారు మా చేతిలోని ఖాళీ సంచులు చూస్తూ.

మాకేం చెప్పాలో తెలీలేదు. ఏం చెప్పాలన్నా, కోపం, అవమానం మా మీద మాకే జాలీ– అన్నీ కలగాపులగమయి నోట మాటరాకుండా చేస్తున్నాయ్.

“నీ యవ్వ దూరదర్శన్” అంటూ హఠాత్తుగా బూతులు తిట్టడం ప్రారంభించాడు చంద్రకాంత్.

మేమందరం కూడా అతనితోపాటు వంత కలిపాం.

“ఈ గవర్నమెంట్‌ని ఎన్నుకున్నదెందుకు మనం! ఏ రంగంలోనూ మోసం, అన్యాయం జరక్కుండా చూడమని. కానీ ఈ నా కొడుకులు మనకి చెప్తారేమిటి– మోసాలకూ, అన్యాయాలకు గురికావొద్దని! అంతా మనమే చూసుకుంటే ఈ బోడి గవర్నమెంటు ఎందుకింక? థూ! తప్పుడు పార్టీలు, తప్పుడు నా యాళ్ళు!” అంటూ తన దారిన తనూ తిట్ట సాగాడు రంగారెడ్డి.

“ఈపాడు టీవీ నా కొంప కూడా ముంచింది సార్! మా అమ్మాయికి పదిహేడో ఏట మంచి సంబంధం వస్తే పద్దెనిమిదేళ్ళు రాందే పెళ్ళిచేయడం చట్టరీత్యా నేరమని చెప్పి పంపి చేశాను. ఇప్పుడు దానికి పెళ్ళి సంబంధాలు రావడం లేదు. ఇప్పుడు దాని పెళ్ళెవడు చేస్తాడు? వయసు తెగపెరిగిపోయింది” అంటూ విలపించసాగాడు మా కాలనీ పెద్దమనిషి ఒకాయన.